క్లుప్తంగా

'విశ్వం'లో ఉచిత అవగాహన సదస్సు రేపు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో ఆదివారం ఉదయం 10గంటలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఆ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సదస్సులో పాల్గొనవచ్చని తెలిపారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానం.. తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించనున్నట్టు తెలియజేశారు. సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షకు ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బాలోత్సవ విజేతలకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

తిరుపతి కల్చరల్ : నగరంలో ఇటీవల నిర్వహించిన తిరుపతి బాలోత్సవంలో విజేతలను వీక్ష ది స్కూల్ చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనంలో ఆర్.యశితారెడ్డి ప్రథమ స్థానం, మట్టి బొమ్మల పోటీలో తాతిరెడ్డి వేద హర్షితరెడ్డి ద్వితీయ స్థానం, మెమరీ టెస్ట్‌లో సోమ సారిష్ ద్వితీయ స్థానం, శాస్త్రీయ నృత్యంలో వెంకటగిరి నైసిక ద్వితీయ స్థానం సాధించారని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ విమల, డాక్టర్ శ్రీనివాస్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో రాజశేఖర్ ప్రతిభ


బహుమతి అందుకుంటున్న రాజశేఖర్

పాకాల : జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాకాల మండలం ఓబులశెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రాజశేఖర్ ఉత్తమ ప్రతిభను కనబరచి ద్వితీయస్థానం దక్కించుకున్నాడు. కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా బహుమతి అందుకున్నాడు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థితోపాటు ప్రాజెక్టు పరిశీలకుడు వెంకటరమణను హెచ్ఎం కె.కుమార్‌రెడ్డి , ఉపాధ్యాయులు అభినందించారు.

వాయిదాల డీఎస్సీ!

వరుసగా వాయిదాలు
- గత ప్రభుత్వ నోటిఫికేషన్ రద్దు
- కొత్త నోటిఫికేషన్ ఇవ్వని కూటమి ప్రభుత్వం
- అయోమయంలో నిరుద్యోగులు


డీఎస్సీకి శిక్షణ పొందుతున్న విద్యార్థులు

తిరుపతి అర్బన్: సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ కూటమి నేతలు అలవిగాని హామీలు గుప్పించారు. డీఎస్సీపైనే తొలి సంతకమంటూ ఉద్యోగులను ఊరించింది. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రమాణస్వీకారం నాడే చంద్రబాబునాయుడు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. ఆ తర్వాత ఏడు నెలలు గడిచినా ఇప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. తాజాగా ఎస్సీ వర్గీకరణ నివేదిక వస్తేనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ అంటూ కొత్త రాగమందుకున్నారు. దీంతో నిరుద్యోగులు రగిలిపోతున్నారు.

కోచింగ్ సెంటర్లలో వేలాదిమంది విద్యార్థులు

డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందన్న ఆశతో వేలాది మంది బీఈడీ, టీటీసీ చదువుకున్న వారు కోచింగ్ సెంటర్లలో చదువుకుంటున్నారు. జిల్లాకు చెందిన 10 వేల మందికి పైగా నెల్లూరు, గుంటూరు, విజయవాడ, తిరుపతిలోని పలు కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్నారు. మరో 20 వేల మందికి పైగా పేద విద్యార్థులు ఇంటి వద్దే ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు జరుగుతున్న తంతు చూస్తుంటే వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి సైతం కొత్త ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయలేని పరిస్థితి నెలకొంది.

కుంటిసాకుల పర్వం

కూటమి సర్కార్ కుంటిసాకులతో మెగా డీఎస్సీని వాయిదా వేస్తూ వస్తోంది. ఇప్పటికే మూడు సార్లు వాయిదాలు వేసింది. ముందుగా డీఎస్సీపై కోర్టు కేసులు పరిశీలించి, అడ్డంకులు తొలగించి, నోటిఫికేషన్ ఇస్తామని చెప్పింది. ఆ తర్వాత ఎస్సీ వర్గీకరణ కమిటీ సూచనల కోసం ఎదురుచూస్తున్నామని మెలిక పెట్టింది. ఎస్సీ కమిషన్ నివేదిక వచ్చేదెప్పుడో? ఆపై ప్రభుత్వం డీఎస్సీని నిర్వహించేదెపుడో? అర్థంగాని పరిస్థితి.

ఆ నోటిఫికేషన్‌ను అమలు చేసి ఉంటే!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 6,100 పోస్టులను భర్తీ చేయడానికి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషనను రద్దు చేసింది. మెగా డీఎస్సీ పేరిట 16,347 పోస్టులు భర్తీ చేస్తామని చెప్పి, ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు స్పష్టమైన సంకేతాలు వెలువడలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను అమలు చేసి ఉంటే ఇప్పటికే కొత్త ఉపాధ్యాయులు విద్యార్థులకు అందుబాటులో ఉండే వారని పలువురు చర్చించుకుంటున్నారు.

మోసం చేయడం సరికాదు



బీఈడీ, టీటీసీ చదువుకున్న పలువురికి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని కూటమి ప్రభుత్వం ఆశ చూపింది. సీఎం చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో గంపెడాశలు పెట్టుకున్నాం. అయితే ఏడు నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు డీఎస్సీ నోటిఫికేషన్‌పై స్పష్టత లేదు. వచ్చే జూన్‌లోనైనా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం సాధ్యమేనా..? అనే అనుమానులు కలుగుతున్నాయి.

-జోగి సులక్షణ, చిల్లకూరు మండలం

డీఎస్సీపై గంపెడాశలు



డీఎస్సీపై గంపెడు ఆశలు పెట్టుకున్నాం. ఎంఎస్సీ, బీఈడీ చదువుకున్నాం. చాలీ చాలనీ జీతాలతో ప్రైవేటుగా ఉద్యోగం చేసుకుంటున్నాం. అయితే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టును సంపాదిస్తే కుటుంబ పోషణకు ఇబ్బందులు ఉండవని భావించాం. అయితే ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణలో జాప్యం చేస్తోంది. ఆలస్యం లేకుండా నోటిఫికేషన్ నిర్వహించాలని కోరుతున్నాం.

-బీ.శివకుమార్, ఎంఎస్సీ, ఎంఈడీ, సైదాపురం

వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి



వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలి. వేలాదిమంది డీఎస్సీ పరీక్ష రాయడానికి శిక్షణ పొందుతున్నారు. ఏడు నెలల క్రితం ముఖ్యమంత్రి స్థాయి నేత డీఎస్సీ కోసం సంతకం చేస్తే.. దాన్ని పట్టించుకోకుంటే ప్రజల్లో నమ్మకం పోయే ప్రమాదం ఉంది. జాప్యం లేకుండా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడంతోపాటు ప్రశాంత వాతావరణంలో పరీక్షను చేపట్టాలి.

-పీ.ప్రసన్న, వరదయ్యపాళెం, డీఎస్సీకి శిక్షణ పొందుతున్న నిరుద్యోగి

ప్రాధాన్యత ఏదీ



సాక్ష్యత్తూ సీఎం చంద్రబాబు నాయుడు పెట్టిన తొలి సంతకానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం బాధాకరం. వెయ్యి కళ్లతో డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్నాం. వేలాది మంది బీఈడీ, డీఎడ్ చదువుకున్న వారిని దృష్టిలో ఉంచుకుని తొలి సంతకాన్ని అమలు చేయాల్సి ఉంది.

-రవిశంకర్‌రెడ్డి-తిరుపతి, డీఎస్సీ అభ్యర్థి

టైలరింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఈనెల 7వ తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌పై పూర్తి ఉచితంగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలు అర్హులన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు ఇస్తామని తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న ప్రాధాన్యతను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్: 79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

50 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 50 మందికి ఒక్కొక్కరికీ పది వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పినట్టు కోర్టు సూపరింటెండెంట్ ఎస్వీ.సుబ్బారెడ్డి తెలిపారు. తిరుపతి అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు, ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచారి ఆదేశాల మేరకు నగరంలో పలుచోట్ల తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. ఆపై కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీ నూతన సంవత్సరం సందర్భంగా మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు బనాయించారు.

నూతన ఆవిష్కరణలు అవసరం


మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

శ్రీకాళహస్తి: నూతన ఆవిష్కరణల కోసం పరిశోధనలు అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు రేకెత్తించేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సమాజ హితం కోసం వినియోగించుకునేలా ఆవిష్కరణలు చేపట్టాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ఉత్పాదకతను పెంచుకునేందుకు దోహదపడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వ్యక్తిగత, విద్యార్థి సామూహిక, ఉపాధ్యా విభాగాల్లో జిల్లా స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విజేతలకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. డీవైఈఓ ప్రభాకర్‌రాజు, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, భాస్కర్, ప్రధానపాధ్యాయులు రాజేశ్వరి, కృష్ణయ్య, మాధవయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా పాఠశాలలో 9వ తరగతి చదివే ప్రత్యేక ప్రతిభావంతుడు చరణ్ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అలరించింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల బృందమ్మ ఆ విద్యార్థిని అభినందించారు.

కార్మికుల పరస్పర దాడులు

పెళ్లకూరు: మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో ఉన్న ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో వేర్వేరు రాష్ట్రాలకు చెందిన కార్మికులు పరస్పర దాడులకు దిగిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. మూడు రోజుల కిందట ఫ్యాక్టరీలో చోటు చేసుకున్న విస్ఫోటనానికి భయాందోళనలకు లోనైనా కొందరు కార్మికులు తమ వేతనాలు వెంటనే చెల్లిస్తే స్వగ్రామాలకు వెళ్లిపోతామంటూ యాజమాన్యానికి విన్నవించారు. ప్రమాదకరమైన యంత్రాల వద్ద పనులు చేసేందుకు పూర్తి స్థాయి రక్షణ కవచాలు అందుబాటులో ఉంచాలని మరికొందరు కార్మికులు కోరారు. ఏదో విధంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిద్దామని ఇంకొందరు అక్కడే ఉండిపోయేందుకు నిశ్చయించుకున్నారు. ఇలా కార్మికుల మధ్య వాగ్వాదాలు తలెత్తాయి. దాంతో రెండు వేర్వేరు రాష్ట్రాలకు చెందిన కార్మికులు పరస్పర దాడులకు దిగారు.నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు ఫ్యాక్టరీ వద్దకు చేరుకొని కార్మికులతో మాట్లాడి సర్దుబాటు చేశారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపిక

కోట: జాతీయ స్థాయి జూడో పోటీలకు చిట్టేడు ఎస్టీ గురుకుల కళాశాల విద్యార్థి టీ.సంతోష్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శేషవర్దన్ శుక్రవారం తెలిపారు. సీనియర్ ఇంటర్ విద్యార్థి సంతోష్ గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో డిసెంబర్ 27 నుంచి మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని 80 కిలోల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్టు తెలిపారు. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. జూడో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థిని ప్రిన్సిపల్‌తోపాటు పీడీ సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

రుయాలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తిరుపతి క్రైం: తిరుపతి రుయా ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. వెస్ట్ పోలీసుల కథనం.. రుయా హాస్పిటల్ సమీపంలోని ఓ నిర్మాణ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి పడిపోయినట్లుగా సమాచారం వచ్చింది. అయితే అక్కడ స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. అనారోగ్యంతో మృతి చెందాడా.. లేదా ఏదైనా ఇతర ఘటనలు చోటుచేసుకున్నాయా..? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన


సమావేశంలో అతిథులు

తిరుపతి తుడా : స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆత్మహత్య ఆలోచనల నివారణ–ప్రాణాధారిత వేద పరిష్కారాలు అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్వీ వేదిక్ వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెంకట రాధేశ్యామ్ విచ్చేసి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఆత్మహత్యలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. స్వార్థపూరిత కారణాలతో ఆత్మహత్యలను భగవద్గీత సైతం ఖండిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, ఎస్‌పీఎంసీడబ్ల్యూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్ పాల్గొన్నారు.

ఫార్మసీ కౌన్సిల్ మెంబర్‌గా నిరంజన్‌బాబు


నిరంజన్‌బాబును సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

రామచంద్రాపురం: ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ మెంబర్‌గా సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ నిరంజన్ బాబు ఎంపికైనట్లు కరస్పాండెంట్ సుమలత తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేసి నిరంజన్‌బాబు దంపతులను సత్కరించారు.

డబ్బులడిగినందుకు బతుకునే తన్నేశాడు!

- వలస జీవిపై దౌర్జన్యం


పానీపూరీ బండిని ధ్వంసం చేసిన దృశ్యం

శ్రీకాళహస్తి: బతుకుదెరువు కోసం ఊరుగాని ఊరొచ్చిన ఓ వలస జీవిపై దౌర్జన్యం చేశారు. పానీపూరి తిని డబ్బులు ఇవ్వకుండా ఆ బండినే కాలితో తన్ని రోడ్డుపై తోసేసి ధ్వంసం చేసి వెళ్లాడో పోగరుబోతు. ఈ ఘటన పుచ్చలపల్లి సుందరయ్య భవనం సాక్షిగా స్థానిక దక్షిణ కైలాస్ నగర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పశ్చిమబెంగల్‌కు చెందిన ప్రదీప్ కుటుంబం బతుకుదెరువు కోసం పొట్ట చేతబట్టుకుని 20 ఏళ్ల క్రితం శ్రీకాళహస్తి పట్టణానికి వచ్చింది. ప్రదీప్ దక్షిణ కైలాసనగర్‌లో పానీపూరి బండి పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి పానీపూరి తినేందుకు ప్రదీప్ వద్దకు వచ్చాడు. తీరా పానీపూరి తిన్నాక డబ్బులు అడినందుకు బండిని కాలితో తన్ని రోడ్డుపై తోసేసి ధ్వంసం చేశాడు. తర్వాత అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో చిరువ్యాపారి బండిని దౌర్జన్యంగా తోసేయడంపై స్థానికులు, పానీపూరి ప్రియులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. సదరు వ్యక్తికోసం గాలిస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

10 నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నీ

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని ఆఫీసర్స్ క్లబ్, టౌన్ క్లబ్‌లలో సనాల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు క్రీడా భారతి అసోసియేషన్ తిరుపతి జిల్లా కార్యదర్శి దండు రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు 40 నుంచి 70ఏళ్ల పైబడ్డ రాయలసీమ జిల్లాలతో పాటు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. 40 ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామని, ప్రతి విభాగంలో విన్నర్స్ కు రూ.5వేలు, రన్నర్స్‌కు రూ.3వేలతో పాటు ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్టు తెలియజేశారు. ఇతర వివరాలకు 94911 45556, 94402 45980, 94412 96125 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం


చిరంజీవి మృతదేహం
మృతి చెందిన తమిళనాడు వాసి కార్తిక్.

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో శుక్రవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. వడమాలపేట మండలం ఎస్వీపురం గుట్టకింద అరుంధతివాడకు చెందిన యాశారపు చిరంజీవులు (47) టీటీడీ అన్నదానం క్యాంటీన్ (తిరుమల)లో పనిచేస్తున్నాడు. రోజు గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై తిరుపతికి వెళ్లి అక్కడ నుంచి తిరుమలకు బస్సులో వెళ్లి డూటీ చేసుకుని వచ్చేవాడు. శుక్రవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కదిరిమంగలం బైపాస్ సర్కిల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే తమిళనాడులోని పెరంబుదూర్‌కు చెందిన కార్తిక్ (22), గౌతమ్ (20) సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై తిరుపతికి బయలుదేరారు. వడమాలపేట మండలం పాదిరేడు సమీపంలో ముందు వెళుతున్న లారీని అధిగమించే ప్రయత్నంలో అదుపు తప్పి అదే లారీ వెనుక చక్రాల కింద పడ్డారు. ఈ ప్రమాదంలో కార్తిక్ అక్కడికక్కడే మృతి చెందగా గౌతమ్ గాయపడ్డాడు. వీరిని టోల్ ప్లాజా వాహనంలో తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించారు. రెండు సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

అదనపు సబ్‌స్టేషన్లు అవసరం


ఎమ్మెల్యే ఆరణిని ఆహ్వానిస్తున్న ఎస్ఈ సురేంద్రనాయుడు

తిరుపతి రూరల్ : నగరంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మరో 15 అదనపు సబ్‌స్టేషన్ల అవసరమని ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. శుక్రవారం తిరుపతి ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆయన పాల్గొన్నారు. భవిష్యత్ విద్యుత్ అవసరాల మేరకు డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యుత్ స్తంభాలకు ఇష్టారాజ్యంగా కట్టిన కేబుల్, ఇంటర్ నెట్ తీగలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నగరంలోని 8 సబ్ స్టేషన్ల పరిధిలో అండర్ గ్రౌండ్ కేబుల్ పనులు పూర్తయ్యాయని, మరో 8 సబ్ స్టేషన్ల పరిధిలో పనులు జరగాల్సి ఉందని వెల్లడించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే వేసవిలో విద్యుత్ ఇక్కట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ కరుణాకర్, ఈఈ లు చంద్రశేఖర్, బాలాజీ, స్మార్ట్ సిటీ ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆలస్యంగా మధురై ఎక్స్‌ప్రెస్

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో మధురై ఎక్స్‌ప్రెస్ శుక్రవారం కొన్ని నిమిషాలపాటు ఆగిపోయింది. మధ్యాహ్నం విజయవాడ నుంచి చెన్నైకి వెళుతున్న సమయంలో నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఎస్ఎస్ఆర్ కాలనీ వద్ద దూడ అడ్డుగా రావడంతో దాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దూడ అక్కడికక్కడే మృతి చెందింది. రైలు ఢీకొని దూడ పట్టాల పక్కనే పడిపోవడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని లోకో పైలెట్ స్థానిక స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారు. సుమారు 5 నిమిషాల పాటు నాయుడుపేటలో ఎక్స్‌ప్రెస్ రైలు నిలిచినట్లు ఎస్ఎం తెలిపారు.

2 కిలోల గంజాయి స్వాధీనం

తిరుపతి క్రైం: ఆటోనగర్ సమీపంలో రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అలిపిరి ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట రోడ్‌లోని పార్క్ హోటల్ ఎదురుగా ఉన్న ఆటోనగర్లో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఒడిశాకి చెందిన ప్రతాప్‌కుమార్ జైన్, తిరుపతికి చెందిన జంజర్ నింబరం గూలీజర్‌గా గుర్తించామన్నారు. వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయి తో పాటు 21 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

భాకరాపేట : వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ వెంకట్రమణ పేర్కొన్నారు. స్థానిక ఫారెస్టు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం స్థానిక విలేకరులతో వివరాలు వెల్లడించారు. గురువారం రాత్రి శ్రీనివాస మంగాపురం వద్ద గల మిట్టపాళెం వంతెన వద్ద అటవీ అధికారులు మాటు వేశారు. వేకువజామున బొలేరో వాహనం అతి వేగంగా వెళ్లడంతో దాన్ని వెంబడించారు. తిరుపతి-రేణిగుంట బైపాస్ రోడ్డుమీదుగా వెళ్లిన వాహనం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఆగింది. ఆ పక్కనే ఉన్న తుమ్మ పొదల్లో దూరి ఇద్దరు స్మగ్లర్లు పారిపోయారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 900 కిలోల బరువు గల 31 ఎర్రచందనం దుంగలతో కలిపి వాహనం విలువ రూ.40 లక్షలు ఉంటుందన్నారు. పారిపోయిన స్మగ్లర్ల కోసం గాలింపు చేపట్టామన్నారు. ఈ దాడుల్లో ఎఫ్ఎస్‌వో ప్రదీప్‌కుమార్, ఎఫ్‌బీవో రాజేష్ కుమార్, రవి, శంకర్, ప్రభుతేజ, శ్రీనివాసులు, కేశవులు, అంజన్‌కుమార్, వినీల్‌కుమార్ పాల్గొన్నారు.

'కొత్త'పలుకు ఏమైందో?


మంగళం డిపోలో రిజిస్ట్రేషన్ కోసం ఉంచిన 18 కొత్త బస్సులు

తిరుపతి అర్బన్: జిల్లాలోని 11 డిపోల పరిధిలో 802 సర్వీసులు ఉండగా అందులో 774 సర్వీసులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగిలిన 200 సర్వీసులకు పైగా సరైన కండీషన్‌లో లేకపోవడంతో కష్టం మీద నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల అలిపిరి డిపోను సందర్శించిన రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి 2025 కొత్త సంవత్సరంలో సంక్రాంతి సమయానికి ఒక్కో జిల్లాకు 100 నుంచి 150 కొత్త సర్వీసులను అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అయితే తిరుపతి జిల్లాకు 18 కొత్త బస్సులు మాత్రమే వచ్చాయి. అందులో వెంకటగిరి డిపోకు 8, వాకాడు డిపోకు 5, గూడూరుకు 4, మంగళం డిపోకు 1 సర్వీసును మంజూరు చేశారు.

క్లుప్తంగా

భూమనకు శుభాకాంక్షలు..



భూమనకు పుష్పగుచ్ఛం అందిస్తున్న కృపాలక్ష్మి

తిరుపతి మంగళం : నూతన సంవత్సరం సందర్భంగా వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డికి పార్టీ జీడీ నెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : వ్యవసాయశాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. డీఏవో ప్రసాద్‌రావు, ఏడీఏ ధనంజయరెడ్డి, ఉద్యోగ సంఘం అధ్యక్షులడు అంజయ్య, అసోసియేట్ అధ్యక్షుడు రాజీవ్, ఉపాధ్యక్షుడు సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసమే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

తిరుపతి కల్చరల్ : నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు తక్షణమే అమలు చేయాలని, ఈ క్రమంలోనే ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి తెలిపారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు గుప్పించిన హామీన్నీ నెరవేర్చాలని కోరారు. సమావేశంలో నేతలు సీహెచ్ ప్రభాకర్, చిన్నం పెంచలయ్య, మహేష్, అంకయ్య, శ్రీనివాసులు, లక్ష్మి, తులసీరాజన్ పాల్గొన్నారు.

మినీ గోకులానికి భూమి పూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

చంద్రగిరి : మండలంలోని ఎ.రంగంపేట పంచాయతీలో మినీ గోకులం నిర్మాణానికి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం భూమి పూజ చేశారు. శిలాఫలకం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రంగంపేట నుంచి భీమవరం వరకు గోకులాల నిర్మాణానికి రూ.2.28 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు.

మన్మోహన్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి అర్బన్ : మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం తిరుపతిలోని యూత్‌హాస్టల్‌లో నిర్వహించిన సంతాప సభలో మన్మోహన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల గురవంబాబు, నగర అధ్యక్షుడు చిట్టిబాబు, నేతలు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, వెంకట నరసింహులు, వెంకటాచలపతి, దామోదర్‌రెడ్డి, మురళి పాల్గొన్నారు.

నారావారిపల్లెలో జాబ్ మేళా



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

చంద్రగిరి : మండలంలోని నారావారిపల్లె టీటీడీ కల్యాణ మండపంలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నాని, డీపీఓ సుశీలాదేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మేళాను ప్రారంభించారు. పలు కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేపట్టి అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీ స్కిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సుమారు 1,200 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు తెలిపారు.

స్పందన

సాక్షి ఎఫెక్ట్..

స్కావెంజర్స్ కాలనీ వద్ద దేవేంద్ర థియేటర్ రోడ్డులో చెత్త కుప్పపై రెండు రోజుల క్రితం సాక్షిలో 'అధ్వాన్నం' శీర్షికతో ఫొటో కథనం ప్రచురితమైన విషయం విధితమే. దీనిపై కార్పొరేషన్ ప్రజా ఆరోగ్యశాఖ అధికారి స్పందించారు. ఆ ప్రాంతంలేఓ వెంటనే చెత్తను తొలగింపజేశారు. మళ్లీ చెత్త చేరకుండా పూల కుండీలు పెట్టించారు. అలాగే చెత్త వేయరాదు అంటూ బోర్డు సైతం ఏర్పాటు చేయించారు. నగర పాలక సంస్థ చేపట్టిన చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

– తిరుపతి తుడా



సాక్షి

అధ్వాన్నం



ఆక్రమణ



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో స్థానిక అన్నారావు కూడలి నుంచి ప్రకాశం పార్క్ వరకు మాస్టర్ ప్లాన్ రోడ్డును అత్యంత సుందరంగా అభివృద్ధి చేశారు. ఇరు వైపులా అక్రమ నిర్మాణాలను తొలగించి బీటీ రోడ్డుగా తీర్చిదిద్దారు. పకడ్బందీగా మురుగు కాలువలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఏర్పాటు చేశారు. ఈ మార్గం మొదలయ్యే చోటనే ఇటీవల ఓ భవనం నిర్మించారు. హోమ్‌స్టేగా మార్చి రోడ్డుపైకి ఐదు అడుగుల మేర ర్యాంపు కట్టేశారు. ఇది చూసి మరికొందరు సైతం ఆక్రమణలకు తెరతీసేందుకు యత్నిస్తున్నారు. దీంతో విశాలమైన రహదారి కాస్తా ఇరుకుగా మారే అవకాశముందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – తిరుపతి తుడా

తుక్కు రేగింది!

'పాత సామాన్లు కొంటాం.. పేపర్లు కొంటాం.. ప్లాస్టిక్ వస్తువులు కొంటాం' ఈ మాటలు వినని వారు ఉండరు. ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మైక్ పెట్టుకుని వీధుల్లో ఊదరగొడుతుంటారు. తుప్పు పట్టిన ఇనుప సామగ్రి.. విరిగిపోయిన కుర్చీలు.. పనిచేయని ఎలక్ట్రానిక్ పరికరాలు ఇతరత్రా వాటిని ఇంటి యజమానుల నుంచి కొనుగోలు చేస్తుంటారు. అయినా అదంతా తుక్కే కదా అనుకుంటే పప్పులో కాలేసినట్లే. తిరుపతి నగరంలో స్క్రాప్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ఏడాదిలో 11 నెలల బిజినెస్ ఒక ఎత్తు అయితే .. డిసెంబర్‌లో దాదాపు నాలుగు రెట్లు అధికంగా ఉంటోంది. ముఖ్యంగా పండుగ నెల ప్రారంభమైనప్పటి నుంచి రూ.కోట్ల టర్నోవర్ సాగుతోంది. ఈ క్రమంలోనే సూపర్ మార్కెట్లు.. కార్పొరేట్ సంస్థలు.. భవన నిర్మాణ వేస్టేజీ టన్నుల కొద్దీ స్క్రాప్ దుకాణాలకు చేరుతోంది. వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.



నగరంలోని ఓ స్క్రాప్ దుకాణం

- నగరంలో కాసులు కురిపిస్తున్న స్క్రాప్ బిజినెస్
- ఒక్క డిసెంబర్‌లోనే సుమారు రూ.8 కోట్ల టర్నోవర్
- వీధి వీధికీ వెళుతున్న పాత సామాన్లు కొనే వ్యాపారులు
- సంక్రాంతి నేపథ్యంలో వేస్టేజ్‌ను అమ్మేస్తున్న ప్రజలు

తిరుపతి సిటీ : నగరంలో వందల కొద్దీ స్క్రాప్ దుకాణాలు ఉన్నాయి. లాభసాటిగా వ్యాపారం సాగుతుండడమే ఇందుకు కారణం. సంక్రాంతి సీజన్ వస్తే చాలు నగరంలోని ప్రతి ఇంటినీ సదరు యజమానులు శుభ్రం చేసుకుంటూ ఉంటారు. ఈ క్రమంలోనే పనిరాని, పనిచేయని వస్తువులను తమ వీధిలోకి వచ్చే చిరు వ్యాపారులకు అమ్మేస్తుంటారు. అలాగే వివిధ వ్యాపార సంస్థల వారు సైతం పాత సామాన్లను విక్రయించేస్తుంటారు. అవన్నీ ప్రతి రోజూ సాయంత్రానికి స్క్రాప్ దుకాణాలకు చేరుతుంటాయి.

డిసెంబర్‌లోనే అధిక వ్యాపారం

పాత సామాన్ల వ్యాపారం ఏటా డిసెంబర్‌లోనే అధికంగా జరుగుతూ ఉంటుంది. 2023 డిసెంబర్‌కు సంబంధించి తిరుపతిలో సుమారు రూ.5కోట్ల బిజినెస్ జరిగింది. అలాగే 2024లోనూ దాదాపు రూ.8కోట్ల వరకు వ్యాపారం సాగినట్లు దుకాణదారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తోపుడు బండల్లలో చిరువ్యాపారులు ప్రతి గల్లీని జల్లెడ పడుతున్నారు. ఈ మేరకు చిన్న దుకాణాల్లో రోజూ 500 కేజీల నుంచి 1000 కేజీల వరకు స్క్రాప్ చేరుతున్నట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. కాస్త పెద్ద షాపులకైతే నిత్యం సుమారు 3 టన్నుల నుంచి 4 టన్నుల వరకు తుక్కు చేరుతోందని వివరిస్తున్నారు.

స్క్రాప్ ధరల వివరాలు

తుక్కు రకం	కిలో (రూ.లో)
ప్లాస్టిక్ వస్తువులు	12
ఐరన్	30
కాపర్	550
ఈ-స్క్రాప్	13
ఎలక్ట్రానిక్ సామగ్రి	28
పాత మోటార్లు,	
యంత్రాలు	35
అట్ట పెట్టెలు	15
న్యూస్ పేపర్లు	12
పాత పుస్తకాలు	8



తోపుడు బండితో పాత సామాన్లు సేకరిస్తున్న చిరు వ్యాపారి



స్క్రాప్‌ను లారీలో నింపుతున్న కార్మికులు

వ్యాపారం బాగా ఉంది



సంక్రాంతితోపాటు న్యూ ఇయర్ నేపథ్యంలో దాదాపు అందరూ తమ ఇళ్లను శుభ్రం చేసుకునే క్రమంలో పాత వస్తువులు బయట పడతాయి. ప్లాస్టిక్, ఇనుము, నిరుపయోగంగా మారిన సైకిళ్లు, పాత్రలు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు పెద్ద సంఖ్యలో దుకాణాలకు వస్తున్నాయి. సాధారణ సమయాల్లో జరిగే వ్యాపారం కంటే పండుగ నెలలో అధికంగా స్క్రాప్ వస్తుంది. వ్యాపారం బాగా ఉంది. చాలా మంది స్వయంగా ఆటోల్లో దుకాణాలకు పాత వస్తువులను తీసుకువస్తున్నారు.

– ఎండీ బాషా, స్క్రాప్ దుకాణ యజమాని, కొర్లగుంట

ఇదే మాకు సీజన్



ఏడాది పాటు జరిగే వ్యాపారం కంటే డిసెంబర్‌లో వ్యాపారం బాగా ఉంటుంది. ఇళ్లలోని పాత వస్తువులు బయటకు వస్తాయి. ఫ్రిజ్‌లు, బీరువాలు, చిన్నచిన్న ఇనుప వస్తువులు, ప్లాస్టిక్ సామాగ్రిని ప్రజలు స్క్రాప్ దుకాణాలకు తరలిస్తుంటారు. కొత్త ఏడాదిలో నిరుపయోగంగా ఉన్న పాత సామాన్లను స్క్రాప్ దుకాణాలకు తరలించడం ఏటా జరుగుతోంది. వీధి వ్యాపారుల నుంచి వచ్చే స్క్రాప్ చిన్న దుకాణాలకే ఎక్కువగా వస్తుంది.

– షేక్ తార, స్క్రాప్ దుకాణం యజమాని, లీలామహల్ సర్కిల్

ఇల్లు శుభ్రం చేస్తుంటే..



పెద్ద పండుగ కదా. ఇల్లు శుభ్రం చేసుకునే క్రమంలో ఏడాది పాటు ఉపయోగించి పాడైన వస్తువులు, ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పుస్తకాలు, పేపర్లు అన్నీ 22కేజీల వరు ఉన్నాయి. వాటిని మేమే దుకాణానికి తీసుకెళ్లి విక్రయించాం. ఏదో చేతి ఖర్చులకు వస్తుంది. ఇల్లు శుభ్రంగా ఉంటుంది. ప్రతి సారి పండుగకు మహిళలకు ఈ పని తప్పదు. వీధి వ్యాపారులకు అమ్మితే కాస్త తక్కువ ధరకు కొనుగోలు చేస్తారు. నేరుగా దుకాణం దగ్గర విక్రయిస్తే కాస్త మంచి ధర ఇస్తారు.

– విజయమ్మ, తిరుపతి

స్క్రాప్ విక్రయంపై విచారణకు డిమాండ్

తిరుపతి కల్చరల్ : ఎస్వీయూలో అక్రమండగా సాగిన స్క్రాప్ విక్రయంపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సుమారు రూ.60 లక్షల స్క్రాప్‌ను కేవలం రూ.8.10 లక్షలకే అ మ్మేయడం అనుమానాస్పదంగా ఉందన్నారు. వర్సిటీ ఆస్తిని ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీవారి సేవలో వేద విద్యార్థులు

తిరుమల: శ్రీవేంకటేశ్వర స్వామివారిని తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం విద్యార్థులు శుక్రవారం సేవించుకున్నారు. పీఠంలో ధనుర్మాస వ్రతం ఆచరించిన సందర్భంగా అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. అంతకు ముందు వేద విజ్ఞాన పీఠం ప్రధానోపాధ్యాయులు కేఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో విద్యార్థులు తమ అధ్యాపకులతో కలిసి నాలుగు మాడ వీధుల్లో విష్ణుసహస్ర నామ పారాయణ గోష్ఠి నిర్వహించారు.

కార్యదర్శి ఇష్టారాజ్యంపై నిరసన



కార్యదర్శి లావణ్యను నిలదీస్తున్న సర్పంచ్ లక్ష్మి

తిరుపతి రూరల్ : మండలంలోని ఓటేరు పంచాయతీ కార్యదర్శి లావణ్య ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండడంపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. శుక్రవారం పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభను బాయ్‌కాట్ చేశారు. సర్పంచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ చంద్రమౌళి మాట్లాడుతూ పంచాయతీ తీర్మానం లేకుండా కార్యదర్శి పలు పోస్టుల్లో నియామకాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్నవారిని తొలగించి, తన బంధువులను ఉద్యోగాల్లో పెట్టుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యథేచ్ఛగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు కనీసం కుర్చీలు కూడా లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వోద్యోగిలా కాకుండా ఓ వర్గానికి కొమ్ము కాస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరకు ప్రజాప్రతినిధులు లేకుండానే కార్యదర్శి తూతూమంత్రంగా గ్రామ సభ నిర్వహించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మైక్రోబయాలజీ, మైక్రోబయాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా(ఎమ్‌బీఎస్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ అడ్వాన్స్‌మెంట్ ఆన్ మైక్రోబయాలజీ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్‌బీఎస్ఐ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ అరవింద్ కే దేశ్‌ముఖ్ హాజరై సింగిల్ సెల్ ప్రోటీన్ ఉపయోగాలు, ప్రోబయోటిక్ ఆహారాలు శారీరక ఆరోగ్యానికి, మానసిక ఆరోగ్యానికి ఏవిధంగా ఉపయోగపడతాయో విద్యార్థులకు అవగాహన కల్పించారు.



అరవింద్ దేశ్‌ముఖ్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

అనంతరం ఉత్తమ విద్యార్థిని పురస్కారాలు ప్రదానం చేశారు. వర్సిటీ అధ్యాపకులు దేశ్‌ముఖ్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ప్రొఫెసర్ జయమాధురి, ప్రొఫెసర్లు స్వర్ణలతా దేవి, సీహెచ్‌ఎం కుమారి, నరసింహ, వాణి, జ్ఞానేశ్వరి, రుక్మిణి పాల్గొన్నారు.

కార్యకర్తలకు మొండిచెయ్యి

– టీడీపీలో ఇబ్బంది పడుతున్నాం

తిరుపతి కల్చరల్: 'ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్యకర్తలను మండల స్థాయి టీడీపీ నేతలు పట్టించుకోవడంలేదు. దీంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.' అని రామచంద్రాపురం మండలం, అనుపల్లి పంచాయతీ, నూతిగుంటపల్లి టీడీపీ బూత్ కన్వీనర్ బి.పురుషోత్తం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కార్యకర్తలకు సంఘమిత్ర, ఫీల్డ్ అస్టెంట్ వంటి పనులతో పాటు రేషన్ షాపులు కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే నాని ఆదేశించినా టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి స్పందించలేదన్నారు. . కాంగ్రెస్ నుంచి వచ్చిన తిరుమలరెడ్డి, మాజీ ఎంపీపీ బిందుమాధవి కార్యకర్తలను విస్మరించి తమకు అనుకూలమైన వారికి పనులు చేస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు.



టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్ పురుషోత్తం

'ఆర్‌హెచ్‌వీఎస్' జిల్లా మహిళా అధ్యక్షులుగా అశ్వనీవర్మ

తిరుపతి కల్చరల్ : రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన (ఆర్‌హెచ్‌వీఎస్) జిల్లా మహిళా అధ్యక్షులుగా సంగరాజు అశ్వనీవర్మను నియమించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి సుకుమార్ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సనాతన హైందవ ధర్మాన్ని, ఆధ్యాత్మిక భావాలను క్షేత్రస్థాయిలో ప్రతి గడపకూ చేర్చాలనే సంకల్పంతో నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగా నూతన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కమిటీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వీరనాగ మల్లయ్య, సహాయ కార్యదర్శిగా జి.వెంకటేశ్వర్లను నియమించినట్లు వివరించారు. ఆర్‌హెచ్‌వీఎస్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు శ్రీదేవి, ఉపాధ్యక్షుడు ఎస్.శంకర్ రాజు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందిస్తున్న నేతలు

సమస్యల పరిష్కారానికే ఫోరమ్

తిరుపతి తుడా : పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తున్నామని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మార్చిలోపు పెండింగ్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఏసీపీ బాలాజీ, టీపీబీఓలు మధుసూదన్, వంశీ పాల్గొన్నారు.

వినతుల మేరకు పరిశీలన

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందించే వినతుల మేరకు పలు ప్రాంతాల్లో అధికారులతో కలసి కమిషనర్ స్వయంగా పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీఈ మధు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు.



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

ఇసుక టిప్పర్ల సీజ్

చంద్రగిరి: మండలంలోని నాగయ్యగారిపల్లి, రెడ్డివారిపల్లి సమీపంలోని స్వర్ణముఖినదిలో టీడీపీ నేతలు ఇసుకను అక్రమంగా తవ్వేస్తున్నారు. రెడ్డివారిపల్లికి చెందిన స్థానిక ప్రజలు శుక్రవారం తెల్లవారుజామున ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నారు. టిప్పర్లకు అడ్డుగా నిలిచి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రవాణాకు సిద్ధంగా ఉన్న మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన టిప్పర్లు

సావిత్రిబాయి సేవలు మరువలేం

తిరుపతి కల్చరల్ : స్త్రీ అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన సావిత్రిబాయి పూలే సేవలు మరువలేమని మేయర్ శిరీష కొనియాడారు. శుక్రవారం వీసీ సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో సావిత్రబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మేయర్‌తోపాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం హాజరయ్యారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమితి నేతలు అక్కినపల్లి లక్ష్మయ్య, కేశవులు, సాకం నాగరాజు, సాకం ప్రభాకర్, అశోక్ సామ్రాట్, మస్తానమ్మ, పెంచలయ్య, మురళి, డిష్ రమణ పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించారు. మహిళా సమాఖ్యజిల్లా కార్యదర్శి బి.నదియా, నేతలు ఎస్.మంజుల, సి.రత్నమ్మ, హరిత, విజయ, అలివేలు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన సిబ్బందికి పురస్కారాలు అందజేశారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, తుడా సెక్రటరీ జి వెంకటనారాయణ, సీఐ కే మధుసూదన్, వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పి.అంకయ్య పాల్గొన్నారు.



సావిత్రిబాయి పూలేకి నివాళులర్పిస్తున్న మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో..

పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ భద్రముణి, ఐద్వా జిల్లా సెక్రటరీ డాక్టర్ సాయిలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ విద్యుల్లత, డాక్టర్ సునీత పాల్గొన్నారు

సంస్కృత వర్సిటీలో...

జాతీయ సంస్కృత వర్సిటీలో సావిత్రిబాయి పూలే జయంతి జరుపుకున్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి నివాళులర్పించారు.

ఎస్వీయూలో...

ఎస్వీయూ ప్రకాశం భవన్‌లో ఏపీ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి, ప్రొఫెసర్ అనురాధ పాల్గొన్నారు.

తిరుపతి గాంధీ రోడ్డు : తీర్థకట్టవీధిలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. టీచర్ లేఖశ్రీని ఘనంగా సత్కరించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి,, ప్రభాకర్ నాయుడు, విజయభాస్కర్ రెడ్డి, విద్వాన్ కస్తూ పద్మనాభన్, తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రబాయి పూలే జయంతి నిర్వహించారు. ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా, డాక్టర్ మాధవి, అధ్యాపకులు చిట్టికళావతి, రమణమ్మ, రేఖ, విష్ణుప్రియ, మాధవి, నాగమణి పాల్గొన్నారు.

చంద్రగిరి : తిరుచానూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రబాయి పూలేకు నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయిని ప్రభావతిని సత్కరించారు. ఎంఈఓ మహ్మద్ రఫీ, హెచ్‌ఎం మురళి, ఏపీటీఎఫ్ నేత వెంకట ముని పాల్గొన్నారు.